

# ఇల్లు

ఇచ్ఛాపురపు రామచంద్రం

**బజ్‌జ్........**

అప్పుడే గాఢనిద్రలోకి జారుతున్న గౌతమ్ ఉలిక్కిపడి కళ్లు తెరిచి .... బలవంతంగా పెద్దవి చేసుకుని చూశాడు. విదేశీ గోడగడియారం - రెండు ముల్లనీ మూడు మీద పెట్టుకుని ముసి ముసిగా నవ్వుతోంది. కిటికీలోంచి చూశాడు. ఆలస్యంగా మేలుకుని ఆలస్యంగా నిద్రపోయే నగరం కూడా నిశ్శబ్దంగానూ ప్రశాంతంగానూ నిద్రలోకి జారుకున్నట్లుంది. వ్యాపారంలో భాగమంటూ ఒత్తిళ్లనుంచి తప్పించుకుందుకు తరుణోపాయమని ఆత్మవంచన చేసుకుంటూ ప్రతిరోజూ దినచర్యకి విస్కీతీసి జనగణమన పాడి వీడ్కోలు చెబుతున్నా, సాటర్‌డే ఈవెనింగ్ ఫీవర్‌కి మందంటూ వారాంతపు పార్టీ పేరిట పీకలమొయ్యా తాగి, పొట్టనిండా మెక్కి, బిజినెస్ ఫ్రండ్స్‌తో ఖుషీచేసి, అరకొర స్పృహతో మంచం మీద వాలి అరగంటయినా కాకుండానే నిద్రాభంగమైతే ఎవరికి మాత్రం చికాకెయ్యదు?

పక్కకి చూశాడు. పక్కంతా పరుచుకుని ఈ శరీరం నాదికాదన్నట్లు నైటీచెదిరినా నాకేంపట్టదన్నట్టు... శబ్దాలకి కూడా అతీతమైన సమాధిలాటి గాఢనిద్రలో .. వొళ్లెరక్కుండా ... ప్రమీల. ఆమె కూడా ఏదో పార్టీకే వెళ్లి వచ్చి వుంటుంది. అతనికామె మీద అసూయ వేసింది.

మళ్లీ బజ్..... ఆ ధ్వని సంగీతంలా సున్నితంగానూ మధురంగానే వుండొచ్చు కాని... రాత్రి నిశ్శబ్దాన్నీ, మనుషుల నిద్రనీ భంగపరిచేది సంగీతమైతే ఏం, శబ్దమైతే ఏం? బంగారంది అయినంత మాత్రాన కత్తి గాయం చేయక మానదు కదా!

గాఢమైన నిద్రకి భంగం కలగడంతో అతను కోపంగానూ, అసహనంగానూ మంచం దిగి ద్వారం వైపు నడవసాగాడు. ఆ అడుగులలో తాగుడు తడబాటు. ఆ తూలుడులో మైకం దిగిపోతూ ... మనిషి మేలుకోసాగాడు. లోపలిమనిషి ... ఎన్నో ఏళ్లుగా లోపల నిద్రపోతున్న నిజమైన మనిషి... గౌతమ్‌లోని అసలైన మనిషి సమాధిలోంచి పునరుత్థానం చెందినట్లు... మేలుకున్నాడు. మెల్లగా తలుపు తీశాడు.

పింకీ! నేటి నాగరికతకి ప్రతీకలా.... క్రాఫ్ చెదిరి .. బట్టలు నలిగి.. అలసట నిండిన ముఖంతో.. బరువుగా వాలిపోతున్న కళ్లతో...

ఆమెనలా చూసేసరికి అతనిలోని అసలు మనిషీ, తండ్రీ, భారతీయుడూ ఒక్కసారి తలెత్తారు. ''టైమెంతయిందో తెలుసా?''

''మూడుంపావేనా కాలేదు- '' అతి తేలికగా అనేసిందామె.

అతనామె వంక తీక్షణంగా చూశాడు. ఆ చూపులోని కొత్తదనానికి, సూటితనానికీ ఆమె కొంచెం తడబడుతూ - ''రెయిన్ సాంగ్ డాన్స్‌లో ఇంటితాళం ఎక్కడో మరచిపోయాను. అందుకని మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యాల్సి వొచ్చింది. సారీ...'' అనేసి తన గదివైపు నడిచింది. అతను- ఆమె వెనుక.

గదిలోకి వెళ్లి తలుపు వేయడానికి వెనక్కి తిరిగిందామె. తన గదిలోకి వచ్చిన అతన్ని చూసి చాలా ఆశ్చర్యపోతూ - ''డాడ్!'' అంది అప్రయత్నంగా.

''నీతో కొంచెం మాట్లాడాలి'' అతని కంఠంలో కరుకుదనం.

''ఇప్పుడా!?'' అందామె అలసటగానూ, అసహనంగానూ.

''ఇంకా మూడుంపావేనా కాలేదు'' ఆమె మాట ఆమెకే అప్పగించి- ''ఇప్పుడే- ఇక్కడే చెప్పాలి. కాకపోతే మరెప్పుడూ చెప్పలేనేమో, ఇప్పటికే ఆలస్యం చేశాననిపిస్తోంది. కాని..... బెటర్ లేట్ దాన్ నెవర్...' అన్నాడతను సోఫాలో కూర్చుంటూ. ఆమె తండ్రి వైపు చూసి..'' ఒక్కనిమిషం ....'' చెప్పండాడీ!'' అని తన సంసిద్ధతని తెలియజేసింది.

''పంకజం....'' మెల్లగా పిలిచాడతను. ఆమె ముఖం చిట్లించింది. ''అదేం పిలుపు డాడీ? అనాగరికంగానూ... అసహ్యంగానూ..'' మామూలుగా... ఎప్పటిలా... పింకీ అంది. అయినా, యివాళ మీకేమయింది? మమ్మీ నువ్వూ పోట్లాడుకున్నారా?''

''లేదు- '' అన్నాడతను ఎలాగో కోపం ఆపుకుని.

''మరి'' ఏమైందన్నట్లు అడిగింది.

''నీ ప్రవర్తన... పద్ధతి... '' పదాలకోసం తడుముకుంటున్నట్టు ఒకసారాగి.... ''అదే.. నీ జీవనశైలి.... నాకు నచ్చడం లేదు....'' ఎలాగో చెప్పేసి ఊపిరి పీల్చుకున్నాడు.

ఆమెలో చాలా చలనం. ''నా జీవనశైలిలో మీకు నచ్చనిదేమిటి?'' సూటిగా అడిగింది.

''ముందుగా నీ డాడీ మమ్మీ పిలుపులు. తరువాత నీ జీన్స్... క్రాఫ్ట్ హెయిర్ స్టైయిల్.

ఫ్రెండ్స్‌తో అర్ధరాత్రి దాటే వరకూ తిరుగుళ్ళు... పార్టీలు... డిస్కోథెక్‌లు... రెయిన్‌సాంగ్ డాన్స్‌లు.. ఇంటర్‌నెట్ ఛాటింగ్‌లు.... ఒకటేమిటి... అన్నీనూ....''

ఆమె తుళ్లిపడి- ''మరి ఇంతవరకూ ఒక్కసారీ చెప్పలేదేం? నేరం ఆరోపిస్తున్నట్లే చూసింది.

''నిజం చెప్పాలంటే- నేను గుర్తించడమూ కొన్ని

గాఢమైన నిద్రకి భంగం కలగడంతో అతను కోపంగానూ, అసహనంగానూ మంచం దిగి ద్వారం వైపు నడవసాగాడు. ఆ అడుగులలో తాగుడు తడబాటు. ఆ తూలుడులో మైకం దిగిపోతూ ... మనిషి మేలుకోసాగాడు. లోపలిమనిషి ... ఎన్నో ఏళ్లుగా లోపల నిద్రపోతున్న నిజమైన మనిషి... గౌతమ్‌లోని అసలైన మనిషి సమాధిలోంచి పునరుత్థానం చెందినట్లు... మేలుకున్నాడు. మెల్లగా తలుపు తీశాడు.

నిమిషాల కిందటే జరిగింది. అది - చాలా హఠాత్తుగా... కాని బలంగా కలిగింది. నువ్వు యిలాగే వుంటే పెళ్లెలా అవుతుంది?''

''కాకపోతే ఏం? ఫ్రెండ్స్ వుంటారు చాలదూ? పెళ్లే జీవితం కాదుగా!?'' నవ్విందామె.

''పంకజం!'' ఆమె మాటలు వినలేనట్లు- అరిచినంత పని చేశాడతను. 'నీకు ఇరవై నిండుతున్నాయి. ఎలా తయారయ్యావో తెలుసా? ఇలా అయితే నీకు పెళ్లి అవదు, ఫ్యూచరూ వుండదు''

శపిస్తున్నట్లే అన్న తండ్రి ముఖంలోకి చూసిందామె.

''డాడీ!...''

''నాన్నగారూ అనలేవూ?'' చికాకు పడ్డాడతను.

ఆమె అతని ముఖంలోకి సూటిగా చూస్తూ... ఏదో ఆలోచించుకుని... ''ఒకసారి గతంలోకి రాగలవా?'' అంది.

అతను అర్థం కానట్లు చూశాడు. ఆమె గొంతు సవరించుకుంది.

''నీకు జ్ఞాపకముందో లేదో కానీ.... నేను ఏదీ మరచిపోలేదు'' అలా ప్రారంభించి....

''నాకు బాగా చిన్నతనం... అప్పటికి మనం మామూలుగానే వుండేవాళ్లం - మనుషుల్లా... అప్పుడు నీకు షేర్స్‌లోనో ఎందులోనో ఊహించలేనంత డబ్బు వొచ్చి పడింది... ఈజీ మనీ.... రాత్రికి రాత్రి ధనవంతుడిని చేసింది. నువ్వు బిజినెస్‌లు ప్రారంభించావు. చాలా డబ్బు... ఒక్కసారి కళ్లజూసేసరికి నువ్వు చాలా చాలా మారిపోయావు.''

''సరిగ్గా అదే క్షణంలో ప్రమీల వొచ్చి ద్వారపు తెర అవతల నిలబడి వారి మాటలు వింటూందని వాళ్లిద్దరూ గమనించలేదు.

''కాళ్లు ఆంధ్రాలోనూ కళ్లు అమెరికాలోనూ అయిపోయావు. అంతటితో ఆగక ఇంటినీ అమెరికా చెయ్యబోయావు. మనుషులనీ అమెరికన్లని చెయ్యసాగావు- పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు అమ్మా నాన్నా అనే నన్ను మమ్మీ డాడీ అనకపోతే నోటిమీద వాత వేస్తానని భయపెట్టావు.

'అమ్మా ఏమిటి అసహ్యంగానూ అలగా మనుషుల పిల్లల్లాగానూ? మమ్మీ... డాడీ... అను. అంటూ బెత్తంతో బెదిరించి బలవంతంగా పిలిపించావు. బడిలో కాక కాన్వెంట్‌లో చేర్పించావు- అది చాలా దూరమైనా. ఇంటికొచ్చిన నాయుడు పిల్లలతో కలిసి ఆడుకోనిచ్చేవాడివి కాదు నీకు పరువుతక్కువని. ఒక్కముక్కలో చెప్పాలంటే, నన్ను స్వేచ్ఛగా పెరగనివ్వకుండా నీ ప్రిస్టేజీ సింబల్‌గా కత్తిరిస్తూ వచ్చావు. నా బాల్యాన్ని నీ గొప్పతనం ప్రదర్శించుకుందుకు తినేస్తూ వచ్చావు...''

ఆ మాటలు వింటూంటే ప్రమీలకి కూడా గతం జ్ఞాపకం వొచ్చింది. గౌతమ్- పంకజాన్నే కాదు. తన జీవితాన్నీ బలవంతంగా మార్చాడు. హఠాత్తుగా భాగ్యవంతుడు కావడంతో నడమంత్రపు సిరీ, నరం మీద పుండూ నరుణ్ణి నిలవనివ్వవనే సామెతను నిజం చేస్తూ- ''ప్రమీ! నువ్వు గొప్పవాడి భార్య ఎలా వుండాలో అలా వుండకపోతే లాభం లేదు. ఇంత ధనవంతుడినైన నా పరువు నిలబెట్టకపోతే అలాటి భార్యని నేను భరించను సుమా!'' అని హెచ్చరించాడు. తను అమ్మాయికి చేత వెన్నముద్దో, వేమన పద్యమో చెబుతూంటే- దాని నోరు మూసేసి ట్వింకిల్ ట్వింకిల్, జాక్ అండ్ జిల్ రైమ్స్ చెప్పించేవాడు. తను జడవేయకుండా- క్రాఫ్ చేయించేశాడు. పరికిణీ జాకెట్లు తగలబెట్టేసి పాశ్చాత్య దుస్తులు వేయించేవాడు. మొదట్లో తను అడ్డుపడబోతే-

''మన పింకీ దొరల పిల్లగా పుట్టకబోయినా పెరగడం దొరలపిల్లగానే పెరుగుతుంది. నువ్వు కూడా దొరసానిలా వుండకపోయావో మాకు దూరమైపోతావ్'' అని ఖచ్చితంగా చెప్పేశాడా నల్ల దొర. ఇక తను చేయగలిగిందేముంది?'' కీలుబొమ్మలా ఆడటంకంటే. అతను తనని హై సొసైటీకి పరిచయం చేశాడు. పేరంటాల ప్లేసులో మీటింగులూ, శుష్క వచనాలూనూ. ఏం చేసినా ఫొటోతో పేపర్లో పడాలనో టీవీలో రావాలనో మాత్రమే. సంఘసేవ అనే నటనతో వార్తా పత్రికలకెక్కెయ్యడమే ఆశయం. డబ్బున్న వాడి భార్య అనేది తక్కువ అర్హత కాదు. అతి శక్తిమంతమయిన ఆయుధం. తరచుగా మార్చేకారు. విత్తంకొద్దీ చిన్నెలూ, వారానికో కొత్త నగ. ... కొత్త ఫ్యాషన్లలో బట్టలు... వాటివల్ల వచ్చి పడిన - మహిళా మండలి ప్రెసిడెంటు లాటి పదవులూ... అతి త్వరగానే హై సొసైటీ లేడీ అనిపించుకుంది.

ఇల్లు పట్టకుండా తిరుగుళ్లూ... కార్యక్రమాలూ..

ఆ జీవితం ఇష్టమై కాదు. విధిలేక. తను బిజినెస్‌ల వెనుక... ప్రమీల కార్యక్రమాల వెనుక.... మరి పింకీ దేనివెనుక? అని ఆలోచించే సమయమూ, పట్టించు కునే శ్రద్ధా ఇద్దరికీ లేకపోయాయి. డబ్బు సంపాదించి ఇవ్వడమే తన ఏకైక కర్తవ్యం అనుకునే వాడు గౌతమ్.

''అమ్మ టీవీ సీరియల్ చూస్తూంటే అమ్మాయి టెక్స్ట్‌బుక్స్ చదువుతుందా?''

పంకజం అడిగిన ప్రశ్నకి ప్రమీల గిజగిజలాడిపో యింది.

''మన ఇల్లే కాదు, మనుషులూ అమెరి కన్‌లైపోయారు. నేనెప్పుడు ఇంటికి వచ్చినా- వచ్చావా ? రా.. అని పలకరించే అమ్మ వుండదు, నాన్నా వుండరు. అర్ధరాత్రి దాటే వరకూ మీరు వ్యాపారం మిషతోనూ, అమ్మ సోషల్ సర్వీసు పేరు తోనూ బయటే వుంటారు. డైనింగ్‌టేబుల్ మీద హాట్ ప్యాక్‌లే పలకరించాలి నన్ను. నేనెవరికి కావాలి? నాకె వరున్నారని? ఎవరూ లేని ఒంటరిని. అమ్మా నాన్నాలు వుండే అనాథని. నేనేమైపోయినా ఎవరికీ పట్టదు. ఇల్లూ నామ మాత్రమే. అలాటప్పుడు నేనేం చెయ్యాలి? ఏం చేస్తాను? ఫ్రండ్స్ వెంట తిరుగుతూ వీలయినంతసేపూ బయటే గడపటం కంటే నాకు అభ్యంతరమేముంది? ఇంటికి చేరినా ఒంటరితనం తప్ప ఒరిగేదేముంది?'' భయంకరమైన సత్యాన్ని గుర్తిస్తున్నట్లు అతనికి నోరు పెగలడం లేదు.

'డబ్బు' అనే పదం స్నేహాలని కూడా నిరోధి స్తుంది. అందుకే ధనవంతులకి నిజమైన స్నేహితులు అరుదు. మానవ సంబంధాలలో ముఖ్యమైన స్నేహాన్ని కూడా కలుషితం చేస్తుంది ధనం. అలాగే కొంత వయసు వచ్చేసిన వారికి స్వచ్ఛమైన, శాశ్వత మైన, సత్యమైన స్నేహం లభించడం కూడా అతి కష్టమే. మనిషి- డబ్బు వెనుక డాలర్ వెనుకా తీసే పరుగు మరింత వేగం పుంజుకుంటున్న ఈ ప్రపంచీక రణ రోజుల్లో స్నేహం మరింత ప్రియమైపోతూంది. నాకూ తెలుసు- నీ పార్టీలూ, ఫ్రండ్సూ రెయిన్‌సాంగ్ డాన్స్‌లూ, ఇంటర్‌నెట్‌లూ, ఛాటింగ్‌లూ.. వేటి లోనూ లోతులేదని, యివన్నీ కుహనా నాగరికత అనే చెట్టు యొక్క కుక్కమూతి పిందెలనీ, ఎండమావు లనీ, మన సంస్కృతీ సంప్రదాయాలకి రక్తానికీ ఎంత మాత్రమూ సరిపడవనీ. అయినా నేను ఆత్మవంచన చేసుకుంటూ... వీటిని నమ్ముతూ వీటివెంట పరుగె త్తాలి. ఎందుకంటే- మరోగతిలేక, అమ్మా... నాన్నా. చెల్లి, తమ్ముడు.. ఏ ఒక్కరు నా అనేవారున్నా నేను చచ్చినా యీ నకిలీ నాగరికత వెంట పరుగెత్తే దాన్నా?

ఆ మాటకి ప్రమీల కళ్లల్లో నీళ్లు తిరిగాయి. గతం మెదడులో కదిలింది.

''ఒక కన్ను కన్నూ కాదు; ఒక బిడ్డ బిడ్డా కాదంటారు పెద్దలు. ప్రభుత్వమే ఇద్దరు బిడ్డల్ని ను మతిస్తూంటే... అని తను మొత్తుకున్నా, ''దొరలకీ, గొప్పవాళ్లకీ ఎక్కువ బిడ్డలుండకూడదు. అధిక సంతానం అనాగరికతే....'' అంటూ ఆపరేషన్ చేయించేశాడు కొత్తగా ధనికుడైన గౌతమ్ - బల వంతంగా.

''రాజీ పడటం మానవ లక్షణమే. నిజమైన బంగారం దొరకదని తేలిపోయినప్పుడు కాకి బంగా రంతోనే సరిపెట్టుకుని ఆనందిస్తూ అలవాటు పడిపో యినట్లు ... నిజమైన ప్రేమాభిమానాలు దుర్లభమని అర్థమైపోయి నేనూ నకిలీల వెనుక పరిగెత్తడం అల వాటు చేసుకున్నాను. ఐతే... వాస్తవాన్ని మాత్రం మరచిపోకుండానే...''

ఒకసారాగి... ''నా దురదృష్టమేమిటంటే అమ్మ కూడా తన వ్యక్తిత్వాన్నీ, సంతానాన్నీ మరచిపోయి నీ ముందు మరబొమ్మ అయిపోవడం.. పదవులపట్లా, పేరు ప్రఖ్యాతులపట్లా వెర్రేకానీ- మమతలూ, మమ కారాలూ మగుల్చుకోకపోవడం, కన్నబిడ్డతో కాస్సేపు కబుర్లు చెప్పడానికి కూడా ఖాళీ దొరకదామెకి. అందుకే - ఆ గోడల మధ్యన టీవీ కంఠాలే తప్ప మనుషుల మాటలు వినిపించవు. మనుషుల నీడలు బుల్లితెరమీద కదలటమే తప్ప సజీవమైన మనుషుల కదలికలు కనిపించవు. గొప్పతనాల ప్రదర్శన తప్ప సహజమైన ప్రవర్తన కనిపించదు'' అని నిట్టూర్చింది పంకజం.

కాలకూట విషం లాంటి చేదునిజం మింగ వలసి వచ్చినట్లూ... సంక్లిష్టమైన పరిస్థితి నెదుర్కొంటు న్నట్లూ గౌతమ్ గిలగిలలాడిపోతున్నాడు. ఆపాదమ స్తకమూ వొణికిపోతూ.. నోరెండిపోతూ... శరీరం చెమటలు పోసేస్తుంటే- అపరాధ భావంతో కుచించు కుపోతున్నాడు.

తాను చేయలేనిది తన అమ్మాయయినా చేయగ లుగుతోందని ప్రమీల ఒకవయిపు సంతోషిస్తోంది.

''పేద పిల్లలు గాలికీ ధూళికీ పెరుగుతారు. వారి పెరుగుదలకి పేదరికం ఎందుకు ప్రతిబంధకం కాదో తెలుసా? డబ్బుకంటే బలమైనదీ అవసరమైనదీ అయిన తల్లిదండ్రుల ప్రేమ వారికి లభించడమే! నాకు దొరకనిది అదే. ఇల్లుకి నిర్వచనం గోడలూ, ఫర్నీచరూ విలువైన వస్తువులే అయితే - అవన్నీ నక్ష త్రాల హోటళ్లలో దొరికేవే. కాని .... ఇల్లంటే... తన కోసం ఆరాటపడేవారూ, తనని ప్రేమించేవారూ, సహజమైన మనుషులూ, తనవారూ. నాన్నా! ఒక్క సారాలోచించు. మనది ఇల్లేనా? మనం మనుషులమే నా?''

తూటాల్లా తగిలిన ఆ ప్రశ్నలకి అతను నిర్ఘాంతపో యాడు. చిన్నపిల్ల అని తాను అనుకుంటూన్న పింకీలో యిన్ని ఆలోచనలా! ఇలాటి ఊహలా?!

తండ్రి మనసులోని సందేహాలని గ్రహించినట్లే... ''నాన్నగారూ! మీరు నా పేరుని అమెరికన్ చేయగలి గారేమో కానీ- లోపల నేను పంకజాన్నే. ఒంటరి తనం నుంచీ, ప్రేమరాహిత్యం నుంచీ తప్పించు కుంటున్నట్లు నటించేందుకు ఆ ముసుగు. ఎప్పటి కైనా ముసుగు ముసుగే. ఎక్కువ కాలం భరించలేం. నా నిజరూపం - అమ్మా నాన్నల ఆలనా పాలనా అనురాగాల కోసం అలమటించే అమ్మాయి పంకజం. వాళ్ల ప్రేమ అందకనే యిలా నాగరికత క్రీనీడలలో తిరగడం, జీవితాన్ని వెదుక్కోవడమూ. నాన్నగారూ! మీరు నన్ను అమ్మాయిలా చూసుకోగలరా? అమ్మ నన్ను పట్టించుకుని ప్రేమ అందించగలదా? నా కోసం కొంచెం మీ ప్రపంచాలని త్యాగం చేయగలరా? ఈ నివాసాన్ని యిప్పటికే నా యిల్లుగా మలుచు కుందుకు మీ వంతు ప్రయత్నం చేస్తారా? చెప్పండి'' అందామె నిలదీస్తున్నట్టే.

తన తప్పు తెలిసి వచ్చినట్లు అతను కంగారు పడి పోసాగాడు నోట మాటరాక.

''మీరు మీ ప్రపంచాలనీ, జీవన విధానాలనీ మార్చుకోకుండా నేను మార్చుకోవాలనుకోవడం అత్యాశే కాదు; అన్యాయం కూడా. ఛారిటీ బిగిన్స్ అట్ హోమ్ అన్నట్లే త్యాగం కూడా మననుంచే ప్రారంభం కావాలి. గ్లోబలైజేషన్ ప్రభావంగా వ్యాపి స్తున్న యీ ఫ్యాషన్లతో ... కలుషితమవుతున్న మన నాగరికత, సంస్కృతి, సంప్రదాయాలూ... సమూ లంగా నాశనమవుతున్న మానవ సంబంధాలూ, మనది కాని నాగరికతని అనుసరిస్తూ అనుసరిస్తూ మనం ఏం కోల్పోతున్నామో.... మన సమాజం ఎలా సర్వనాశనం అవుతోందీ? డాలర్ వెంట పరుగులో ఎంత విలువైన జీవితం , అనుబంధాలూ ఫణం పెట్టబడుతున్నాయో ఒక్కసారి శాంతంగా ఆలో చించు. ఇలాటి జీవితానికి చివరకేం మిగులుతుందీ ఊహించు. మన గోడలని యిల్లుగా మార్చుకుందా మని నువ్వూ అమ్మా అనుకోవాలేగానీ నేను సిద్ధమే. అంతకంటూ నాకు వేరే సంతోషమూ సరదా వుండవు'' అంది పంకజం కచ్చితమైన స్వరంతోనూ, యిక అతన్ని వెళ్లమన్నట్లూ...

అక్కడినుంచి అతనూ ద్వారం అవతలినుంచి ప్రమీలా... తేలుకుట్టిన దొంగల్లా తమ గదికి జారుకు న్నారు.

★

